INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed:VOLUME:9, ISSUE:5(7), MAY:2020

# రవీంద్రుని గీతాలకు అందమైన అనుసృజన చేసిన చిత్తూరు జిల్లా కవయిత్రి డా॥ జె.భాగ్యలక్ష్మి

**డా॥ జి. ఉషారాణి**
రీడర్ ఇన్ తెలుగు
శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
పుంగనూరు,
చిత్తూరు జిల్లా (ఆం.ప్ర.)

తెలుగు సాహితీజగత్తుకు చిత్తూరు జిల్లాకు చెందిన ధూర్జటి, అన్నమయ్య, సారంగపాణి, కట్టమంచి రామలింగారెడ్డి, శంకరంబాడి సుందరాచారి, మధురాంతకం రాజారాం ....... ఇలా లెక్కకు మిక్కిలిగా కవులు, రచయితలు సాహితీసేవ చేశారు. 'మేము సైతం' అంటూ తాళ్ళపాక తిమ్మక్క , తరిగొండ వెంగమాంబ, కట్టమంచి నరసమ్మ, కట్టమంచి లక్ష్మమ్మ, ఆలూరు రత్నమ్మ వంటి ఎందరో కవయిత్రులు, రచయిత్రులు సైతం కవనరంగంలో తమ సత్తా చాటుకున్నారు. వివిధ ప్రక్రియల్లో రచనలు చేసి తెలుగు పాఠకులకు సాహిత్యామృతాన్ని పంచిపెట్టారు. చిత్తూరుజిల్లా రచయిత్రుల్లో అనువాదంలో వున్న ప్రయోజనాన్ని, సౌందర్యాన్ని తెలుగు పాఠకులకు సమర్థవంతంగా అందించగలిగిన రచయిత్రి డా॥ జె. భాగ్యలక్ష్మి.

శ్రీమతి భాగ్యలక్ష్మి గారు 1948లో చిత్తూరు జిల్లా, మదనపల్లిలో జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, సుబ్బన్న గార్లు. తండ్రి ఒక రైతు. ఈవిడ మధ్యతరగతికి రైతు కుటుంబంలో పుట్టినప్పటికీ, వీరి తల్లిదండ్రుల మీద "దివ్యజ్ఞానసమాజం" (మదనపల్లి) ప్రభావం అధికంగా ఉండడంవల్ల బిడ్డలందరినీ విద్యావంతుల్ని చేశారు. ఈమె తొలి తెలుగు కేంద్ర (ఢిల్లీ) ఆకాశవాణి న్యూస్ రీడర్ శ్రీమతి జోళెపాళెం మంగమ్మగారి చెల్లెలు. వీరి పి.హెచ్.డి అంశము "IVY COMPTON - BURNETT & HER ART" ఈమె కేంద్ర ప్రభుత్వోద్యోగిని. ఇప్పటివరకు దాదాపు 25 పుస్తకాలు ముద్రింపబడ్డాయి. ఈమె రచనలు -

1. గౌరవంగా జీవించడం ("శివ్‌ఖేర్ లివింగ్ విత్ ఆనర్"కు అనువాదం)
2. ధ్యాన ("జడ్జ్"కు అనువాదం)
3. నెలకూన (రవీంద్రనాథ్ ఠాగూర్ క్రిసెంట్ మూన్‌కు అనువాదం)
4. మరో మజిలీ (రవీంద్రుని కథలు అనువాదం)
5. క్యాపిటల్ విట్నెస్ (జి.కె.రెడ్డి గారి రచనకు అనువాదం)
6. కాదేదీ కవితకనర్హం (కథలు)
7. మహాత్మాగాంధీ మనస్సు (అనువాదం)
8. కథాభారతి (హిందీ కథల అనువాదం)
9. మానవాధికారాలు (అనువాదం)
10. గీతాంజలి (రవీంద్రుని "గీతాంజలి" కి అనువాదం) ------- మొదలైనవి.

**ఇతర రచనలు :-**

పేట్రియెట్ - వేవ్‌లెన్త్ అనే హ్యూమర్ కాలమ్,
ఆంధ్రప్రభలో వీక్లీ కాలమ్,
దస్కోరియా (ఛండీగడ్) అనే మాసపత్రికలో రెగ్యులర్ కాలమ్,
హైదరాబాద్ మిర్రర్ పత్రికలో ఒక కాలమ్

**అవార్డులు :-** రఫీఅహ్మద్ కిద్వాయ్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, జ్యేష్ఠ లిటరరీ అవార్డు.

1913 లో నోబెల్ బహుమతి పొంది, విశ్వస్థాయిలో భారత సాహిత్యానికి అత్యంత ప్రతిష్ఠను చేకూర్చిన విశ్వకవి రవీంద్రుని గీతాంజలి, ది క్రెసెంట్ మూన్ రచనలను శ్రీమతి భాగ్యలక్ష్మి గారు గీతాంజలి, నెలకూన అనే పేర్లతో అనుసృజన చేశారు.

గీతాంజలిలో అనంతమైన ప్రేమ, ఆత్మ పరమాత్మకోసం తపించడం, ప్రకృతి సౌందర్యం, తాత్విక చింతన, భౌతిక విషయాలను అధిగమించే అన్వేషణ పాఠకులను అంతర్ముఖుల్ని చేస్తాయి. ఆ లక్షణాలు భాగ్యలక్ష్మి గారిని ఈ రచనలకు ప్రోత్సహించాయనవచ్చు. వీరి ఈ రచనలను పరిశీలిద్దాం.

" వ్యర్థంగా గడిపిన రోజుల గురించి ఎంతో విచారించాను. కానీ కాలం వృథా
కాలేదు. నా జీవితంలోని ప్రతిక్షణాన్నీ నీవు నీ చేతుల్లోకి తీసుకొన్నావు.
వస్తువులలో అంతర్లీనమై బీజాలను మొక్కలుగా, మొగ్గలను పూవులుగా,
పువ్వులను ఫలాలుగా మారుస్తున్నావు.
నేను అలసిపోయి సోమరిగా పక్క మీద పడుకొని అందరూ పని చాలించారను
కొన్నాను. ఉదయం లేచి చూస్తే నా తోటంతా చిత్రాతి చిత్రంగా పువ్వులతో నిండి పోయివుంది".

(గీతాంజలి - 80)

ఈ కవిత మనిషి నైజాన్ని చక్కగా వివరించింది. మనిషి తాను ఎన్నో పనులను అశ్రద్ధ చేసి, ఎన్నో రోజులను వ్యర్థం చేసుకుంటాడు. అదే భగవంతుడు వస్తువులలో అంతర్లీనమై ప్రకృతిని పులకింపజేస్తాడు. ఒక్క క్షణాన్ని వృథా చేయడు. మనిషి తాను సోమరిగా పడుకొని, అందరూ పనిచేయడం లేదని అంటాడు. ఉదయాన్నే లేచిచూస్తే తోట పువ్వులతో నిండిపోయి అందంగా కనిపిస్తుంది.

## పాపాయి పుట్టుక

'ఎటునుండి వచ్చాను అమ్మా?
నే నెచట దొరికాను నీకు?'
అమ్మకళ్ళల్లోన నీళ్ళు మెదిలాయి
ఆమె పెదవులపైన నవ్వు మెరిసింది
గట్టిగా పాపను హత్తుకొన్నాక
ఈ కథను తియ్యగా చెప్పసాగింది.
'నాలోని కోరికయి దాగి ఉంటివి పాపా
నా ఆటబొమ్మల్లో కలిసి ఉంటివి నీవు
మట్టిబొమ్మలకు నేరూపు దిద్దినవేళ
నీరూపు నా ఎదలో దిద్దుకొన్నాను.
ఇలవేల్పులో నిలిచి నెలకొన్న నిన్ను
స్వామితో పాటుగా పూజించినాను
ఆశల్లో ఆశగా, కాంక్షల్లో కాంక్షగా
నా జీవితములోన ఇమిడి ఉంటివి తల్లీ.
మన ఇంటి నేలేటి అదృశ్యశక్తి
తరతరమ్ములనుండి నిను పెంచెనమ్మా
నా హృదయకుసుమమ్ము విచ్చుకొన్న క్షణాన
దాని పరిమళ మగుచు అలరినావమ్మా
ఉదయాద్రి భాస్కరుడు ఎక్కి వచ్చేముందు
పసిడికాంతులు నింగి నింపుకొన్నట్లు
నా తరుణదేహంపు టణువణువునందు
నీ సున్నితపు కాంతి నిండి ఉండేదమ్మా
స్వర్గదేవత కిష్టతరమమైన సుతవు
ఉదయ కిరణాలతోపాటు ఉదయించావు
జీవనజలధిపై తేలివచ్చావు
ఎట్టకేలకు నా హృదయము చేరినావు
నీ చిన్నిమోము నే తనివార చూస్తే
వింతవింతగ మనసు చిందులేస్తుంది
లోక సంపదవు నా దానివయ్యావని
నాలోన నేనెంతో మురిసిపోతాను
దూరమయ్యెదవని నిను హత్తుకొంటాను
సకల విశ్వైశ్వర్యమీ రెండు చేతుల్లో
ఏ ఇంద్రజాలము ఇమిడ్చినాదో,
చెప్పవే నా చిట్టి, బంగారుతల్లి.

(నెలకూన - 120)

ఈ కవిత ప్రతి తల్లికి ప్రతీక. తన బిడ్డ మాటలు నేర్చి "అమ్మా! నేను ఎక్కడినుంచి వచ్చాను?" అని ప్రశ్నించినపుడు ఆ తల్లి కన్నుల్లో నీళ్ళు, పెదవులపై నవ్వులు విరగబూస్తాయి. అప్పుడు తనబిడ్డకు ఆమె వచ్చిన లోకాన్ని గురించి చిత్రవిచిత్రమైన, అద్భుతమైన కథలను తల్లి అల్లుతుంది. అలాంటి కథల సమాహారం ఈ కవిత. తాను మట్టి బొమ్మలను తయారుచేసేటప్పుడు తన హృదయంలో తన బిడ్డ రూపుదిద్దుకుందని, లోకంలోని సంపద అంతా తన చేతుల్లో బిడ్డరూపంగా మార్చి భగవంతుడు ఉంచాడని అంటుంది.

## మబ్బులాట - అలలపాట

ఇద్దరమూ కలిసి ఆడుకొందామమ్మా
నేనేమొ మబ్బును, నీవు జాబిల్లి
రెండు చేతులా నీ మోము దాచేను
కడలిలో కెరటాలు నన్ను పిలిచాయి
తమతోటి పాటలు పాడమన్నాయి
పగలు రేయిని హాయి పాడుకొంటాము
ఎంతెంతొ దూరాలు పయనించుతాము
అంతకంటే మంచి ఆట ఉందమ్మా
ఇద్దరమూ కలిసి ఆడుకొందామమ్మా
నేను సముద్రమునంట, నీవు తీరమువంట
దోర్లుతూ, పొర్లుతూ నిన్ను చేరానంట
(నెలకూన - 131)

ఈ కవిత ప్రకృతి-మానవునికి ఉన్న సంబంధాన్ని, తల్లీబిడ్డకున్న అనుబంధాన్ని వివరిస్తుంది. ఒక పాపాయిని మేఘాలు ఆకర్షించాయి. వాటితో ఆమె ఆడుకోవాలనుకుంది. అయితే అమ్మ గుర్తుకొచ్చింది. అమ్మ ఆట గుర్తొచ్చింది. తాను మబ్బు, అమ్మ జాబిలి. రెండు చేతుల్లో ముఖం దాచుకొని దోబూచులాడింది. పాపాయి సముద్రంలోని అలలతో ఆడుకోవాలనుకుంది. కానీ అమ్మను వదలి తాను ఎలా వెళ్ళాలి అనుకుంది. అయితే తాను సముద్రము, అమ్మ తీరము. తాను అలాఅలా పరుగులు తీస్తూ అలలా అమ్మను చేరుకోవచ్చు. ఎంత చక్కటి ఊహ.

## ఆటలు

మట్టిలో కూర్చుని నవ్వుతున్నావు
ఎండుపుల్లలతో ఆడుతున్నావు
విరిగిన పుల్లలో ఏ సంపదుందో
పరిసరాలుకూడ మరచిపోయావు
ఉదయాన లెక్కలు వేసికొంటున్నా
అంకెలు కూడుతూ తీసివేస్తున్నా
'నీ ఆట ఏమి బాగులే' దంటూ
నా వంక చూచి నవ్వుతున్నావేమొ
మట్టిబెడ్డలతో, ఎండు పుల్లలతో
ఆడుకొనే రోజులు మరచిపోయాను
వెండి బంగారాలు కోరుతున్నాను
డబ్బుకోసమె బ్రతుకుగడుపుతున్నాను.
ఏది కనిపించినా తృప్తిపడుతావు
దానితోనె మనసార ఆడుకొంటావు
తీరనికోరికలు తీర్చుకోవాలంటూ
తపనతోనే నేను బ్రతుకుతున్నాను
ఆశాపయోనిధిని దాటి పోవాలంటూ
చిన్ని పడవకు నేను తెడ్డు వేస్తున్నాను
ఆవలి ఒడ్డును చేరలేనని తెలిసీ
ఇచటనే ఆటలో మునిగి ఉన్నాను. (నెలకూన - 127)

బాల్యంలో విలువలేనివి అనిపించుకొనే మట్టి బెడ్డలు, చీపురు పుల్లలు మొదలైన వస్తువులతో అపురూపంగా ఆడుకుంటూ ఉంటాం. పెరిగిపెద్దయ్యేకొద్దీ వెండీ, బంగారు, డబ్బు - వీటికోసం తాపత్రయపడుతూ తృప్తిలేని జీవితాన్ని గడుపుతూ ఉంటాం. ఆ బాల్యపు ఆటల్లో ఉన్న ఆనందాన్ని, అమాయకత్వాన్ని ఈ కవిత తెలియజేస్తోంది.

## వానరోజు

కారడవిపై మబ్బు లలముకొన్నాయి
చిట్టిబాబూ నీవు బయట కెళ్ళొద్దు
చెఱువుపక్కనున్న తాటిచెట్లన్నీ
మేఘాలతో చేరి 'ఢీ'లు కొట్టున్నాయి
చెట్లపై కాకుల గుంపు చేరింది
మన ఆవు బయటనే ఉండిపోయింది
పాకలో దానిని కట్టివస్తాను
చిట్టిబాబూ నీవు ఇక్కడే ఉండు
బురదగుంటల్లోన, నీటి మడుగుల్లోన
ఎవరెవరో చేపలను వెదకుతున్నారు
పిల్లకాలువ పరుగు చూడర బాబు
అచ్చంగ నీలాగే పారిపోతోంది
పడవవాడు రేవు చేరుకొన్నాడు
చీకట్లు ఊరంతా అలముకొన్నాయి
వానపై మేఘాలు స్వారిచేస్తున్నాయి
నీళ్ళతో అమ్మలు ఇండ్లుచేరారు
సంజదీపం నేను పెట్టివస్తాను
చిట్టిబాబూ ఇంతలో పారిపోబోకు
దారిలో బురదకు కాలు జారేను
ఈదురుగాలికి జబ్బు చేసేను (రవీంద్ర గీతాలు - 138)

పల్లెసీమల్లో వానపడే సమయంలో కనిపించే ఒక సహజమైన దృశ్యం ఈ కవితలో కనిపిస్తుంది. ఇంకా ఊహతెలియని తన బిడ్డను ఇంట్లో ఉంచి, ఆ వానలో ఇంటికి చేరని తన ఆవుకోసం వెళ్ళే తల్లి బిడ్డకు చెప్పే జాగ్రత్తలు, హృదయంలో పేరుకున్న భయం, బిడ్డను హెచ్చరించే తీరు అత్యంత సున్నితంగా ఈ కవితలో వర్ణింపబడింది.

### కథచెప్పవమ్మా!

దీపాంతర ఎడారి కథను చెప్పావు
ఏ రాజు రాజ్యంలో అది ఉందో చెప్ప
ఆ సముద్రం దాని పక్కనే ఉందా
అచటి ఎడారిలో కొండలున్నాయా?
అక్కడ పొదలంటు అసలు లేవా అమ్మా
కాలిబాటలుకూడ అచట లేకుంటే
కట్టెలమ్మి, పాపం ఊరు చేరొద్దా?
రైతులందరూ వారి పొలము వెళ్ళొద్దా?
పచ్చగడ్డిమాత్రం అక్కడక్కడ ఉందా?
పెద్ద మర్రిచెట్టు ఉందా?
గంధభేరుండ పక్షులున్నాయా?
అవి రాకుమారునికి సాయమొస్తాయా?
ఐదు ద్వీపాల కావల మాయ నగరంలో
రాక్షసుడు రాకుమార్తెను బంధించినాడా?
గుర్రమెక్కిన రాకుమారుడు ఎవరికొడుకమ్మా
రాకుమారికై పాపం వెదకుతున్నాడా?

(రవీంద్రగీతాలు - 141)

తీరిక సమయంలో తల్లిచెప్పే కథలు పసివాడి మనస్సులో ప్రశ్నలవర్షాలను కురిపిస్తాయి. అటువంటి ఓ పసివాడి ప్రశ్నల సమాహారమే ఈ కథచెప్పవమ్మా. ఆటలతో అలసిపోయి, సెలవు తీరికతో విసిగిపోయిన ఆ పసివాడు తల్లిని కథ చెప్పమని అడుగుతున్నాడు. అంతేగాక, తాను విన్న కథల్లో దీపాంతర ఎడారి ఎక్కడ ఉంది? గండభేరుండ పక్షులు ఎక్కడున్నాయి. అవి రాకుమారుడికి సహాయం చేస్తాయా? ఐదు ద్వీపాల అవతల రాక్షసుడు రాకుమార్తెను బంధించాడా? రాకుమారుడు ఆమెను విడిపించాడా? - ఇలాంటి ప్రశ్నల పరంపరతో తల్లిని అయోమయంలో పెట్టేస్తాడు.

### పూలబాలలు

తుఫాను మేఘాలు గర్జించువేళ
కుంభవృష్టి హోరు మంటూ కురియు
చలచల్లటి గాలి పొదలపై వీచి
వెదురు పొదరిండ్లలో ఈల వేస్తుంది
ఎటునుండి వస్తాయో రంగైనపూలు
ఈ పచ్చగడ్డిపై సొంపుగానిలిచి
నవ్వుతూ తుళ్ళుతూ నాట్యమాడేను
ఇన్నాళ్ళు ఎక్కడ దాగి ఉన్నాయో
భూమిలోపల బడి ఒక్కటుండేమొ
పువ్వులు ఆ బడికి వెళ్లి తీరాలేమో
తలుపులన్నీ మూసి పాఠాలు వింటూ
ఆట విడుపున కవీ ఎదురుచూస్తాయేమో!
వానలకు వారికి సెలవులిస్తారమ్మా
చెట్ల కొమ్మలు గాలికూగుతూ ఉంటే
మేఘాలు క్రూరంగ ఉరుముతూ ఉంటే
పూల బాలలు నవ్వుతూ వెలికివస్తారు
పూలబాలల ఇల్లు నీకు తెలుసా అమ్మా?
తారికాలోకంలో ఉండి ఉండాలి
త్వరత్వరగ తమ ఇల్లు చేరుకోవాలని
పూబాల లెంతగా ఆశ పడతారో!
పూబాలలకు ఒక అమ్మ ఉండి ఉండాలి
దూరంగ నవ్వుతూ కనిపించి ఉండాలి
అందు కోసమె వారు చేయిచాపుతుంటారు
అమ్మకోసం తపన పడుతారు పాపం

(రవీంద్ర గీతాలు - 151)

వికసించిన పువ్వులు పసిపిల్లల నవ్వులు. ఆ బోసినవ్వుల బాలలకు పూలబాలలు ఆనందాన్ని కలిగిస్తాయి. అయితే అమాయకత్వం నిండిన ఆ కళ్ళకు పూసే పువ్వులు ప్రశ్నార్థకాలు. పువ్వులు ఎక్కడి నుండి వస్తాయి? ఇన్నాళ్ళు ఎక్కడ దాగున్నాయో? భూమిలోపల ఉండే పాఠశాలలో తలుపులన్నీమూసి పాఠాలు వింటూ, వానలకు వారికి సెలవిచ్చినప్పుడు కొమ్మలమీదుగా వస్తాయేమో అని పిల్లలు ఆలోచిస్తున్నట్లు భాగ్యలక్ష్మిగారు చక్కగా అనుసృజన చేశారు.

## చిన్నారి పెద్దమనిషి

నాన్నగారంత ఎత్తు నే నెదిగాక
నా పనుల కెవ్వరూ అడ్డూరాలేరు
మాస్టారు పాఠాలు నేర్చుకోమంటే
'పాఠాలు నేనింకచదువ' నంటాను
మాస్టారు వినగానె తెల్లబోతారు
'నీ ఇష్టమే' నంటూ వెళ్ళిపోతారు
రంగైన బట్టలు వేసికొంటాను
సంతకేసి నేను నడువబోతాను
మామయ్య పరుగున చెంతకొస్తారు
తన చేయిపట్టుకు నడవమంటారు
నేను పెద్దవాడినని తెలియజెపుతాను
ఒంటరిగ వెళ్ళుతానని నచ్చజెపుతాను
పెద్దవాడినని మామకు తెలిసిపోయాక
ఇష్టమొచ్చిన చోట కెళ్ళమంటారు
దానికి నేను డబ్బులిచ్చానంటే
అమ్మ మొదట నన్ను కోపగిస్తుంది
తరువాత తల ఊచి ఊరుకొంటుంది
పెద్దవాడనని తెలిసికొంటుంది.
నాన్నగారు సెలవులకు ఇంటికొస్తారు
బూట్లు, చొక్కాలు నాకు తీసికొస్తారు
అన్నయ్యకే వాటి నియ్యమంటాను
నా ఘనత నాన్నకు వెల్లడిస్తాను (నెలకూన - 160)

పసితనంలో పెద్దలు ఆంక్షలు పెట్టినప్పుడు, పిల్లలు త్వరగా ఎదిగిపోయి, పెద్దవారిగా మారిపోవాలి అని అనుకుంటారు. అదే ఈ కవిత్వంలో చిన్నారి పెద్దమనిషి ఆలోచనా సరళి.

## కవిత్వం

నాన్నగా రెప్పుడూ ఏమివ్రాస్తారమ్మా
ఒక్కనాడయిననా నాకు చెప్పవేమమ్మా
నిన్నంతా నీకు చదివి వినిపించారు
అది ఏమిటో అసలు అంతుబట్టిందా?
చక్కటి కథలెన్నో నీవు చెబుతుంటావు
నాన్నగారా కథలు వ్రాయరేమమ్మా?
రక్కసుల, రాకుమార్తెల కథలు రావేమో
విన్నవన్నీ తనకు గుర్తులేవేమో!
స్నానాలవేళ నాన్నకు గుర్తుతెస్తావు
తినకుండ వారికై వేచి ఉంటావు
నాన్న నీ మాటలే వినిపించుకోరు
పుస్తకాల్లో ఎప్పుడూ మునిగిఉంటారు
నాన్న గదిలోకి నే నడుగుబెట్టానంటె
'వద్దు, వద్దంటూను వెంటబడుతావు'
కొద్దిగా చప్పుడు చేసినానంటె
నోటిపై వ్రేలుంచి సైగచేస్తావు
నాన్న కలంతో నేను " అ ఆ " లు రాస్తే
నీ కెందుకో చాల కోపమొస్తుంది
నాన్నగా రెప్పుడూ రాయటంలేదా?
ఒక్కసారైనా కోపగించావా?
ఒక్కటంటే ఒక్క కాగితం తీసి
పెద్దపడవ నేను చేసికొంటుంటే
కాగితాలు పాడుచేయవద్దంటూ
కళ్ళు పెద్దగచేసి బెదరగొట్టావు
కాగితాలను నాన్న ఉండలుండలు చేసి
రెండు వేపుల సిరాగీతలన్ని గీచి
ఇష్టమొచ్చినరీతి పాడుచేసేరు
చిత్రమేమిటో నీకు కోపమేరాదు (నెలకూన - 163)

కొన్ని పనులు పెద్దలుచేస్తే ఒప్పు, పిల్లలు చేస్తే తప్పు. ఇది ఎందుకు అని పిల్లలు ఆశ్చర్యపోతారు. అదే ప్రశ్న ఈ కవితలో ఓ బుడతడి మనస్సులో తలెత్తుతూ ఉంది. తన తండ్రి కథలూ, కవితలూ రాస్తూ, కాగితాలను ఉండలు చుట్టీ విసరేస్తూవుంటే అమ్మకు కోపమేరాదు. కానీ ఒకేఒక్క కాగితం తీసుకొని తాను పడవ చేసుకుంటే అమ్మ వెంటనే కోప్పడుతుంది.

భాగ్యలక్ష్మిగారు రవీంద్రుని గీతాలను అనుసృజన చేసినప్పటికీ, ఆ కవితల్లోని భావాలు చదువుతున్నప్పుడు తెలుగు ప్రాంతీయతకే అద్దం పడుతున్నట్లు అనిపిస్తాయి. భాగ్యలక్ష్మిగారు పాఠకుడికి రవీంద్రుని గీతాలను సులభశైలిలో, సరళభాషలో, తేటతెనుగు మాటలతో కవితల్ని అందించి అలరించారు. అనువాదంలోని ప్రయోజనాన్ని సంపూర్ణంగా అందజేశారు.

**ఉపయుక్త గ్రంథాలు :-**

1. గీతాంజలి (రవీంద్రుని "గీతాంజలి" కి అనువాదం) - డా॥ జె. భాగ్యలక్ష్మి
2. నెలకూన (రవీంద్రనాథ్ ఠాగూర్ క్రిసెంట్ మూన్‌కు అనువాదం) - డా॥ జె. భాగ్యలక్ష్మి
3. చిత్తూరుజిల్లా రచయిత్రుల రచనల సమగ్ర పరిశీలన (ఎం.ఆర్.పి. పరిశోధనాగ్రంథము)- డా॥ జి. ఉషారాణి.